క్లుప్తంగా

31న మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 31న శుక్రవారం ఉదయం 11 గంటలకు మునిసిపాలిటీ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విజయసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ అధ్యక్షత వహిస్తారని, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని పేర్కొన్నారు.

విశ్వేశ్వరంలో ఉచిత పశు వైద్యశిబిరం



రేపల్లెరూరల్: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో విశ్వేశ్వరం పంచాయతీలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ కరి శివమల్లేశ్వరరావు ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, మీనాక్షిదేవి 103 పశువులకు టీకాలు వేశారు. 114 గేదెలు, దూడలకు వైద్య పరీక్షలు నిర్వహించి పశు యజమానులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు బాపూజీ, వర్ధన్, రైతులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక



నిజాంపట్నం: ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్)కు తమ పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు కొత్తపాలెం పంచాయతీ నక్షత్ర నగర్ ప్రాథమికోన్నత ప్రాధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు తెలిపారు. పాఠశాలలో మంగళవారం విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు మోపిదేవి హేమంత్, విశ్వనాథపల్లి చందు, చిప్పల సుమంత్ వర్మ, సైకం నాంచరమ్మ ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయుడు శివనాగరాజు పాల్గొన్నారు.

వలివేరులో ఉచిత పశు వైద్య శిబిరం



చుండూరు (భట్టిప్రోలు): వలివేరు పశు వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పశు వైద్యుడు సీహెచ్ చలపతిరావు ప్రారంభించి, మాట్లాడారు. వేసవిలో పశువుల యాజమాన్యం గురించి తెలియజేశారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మాత్రమే మేత కోసం పశువులను బయటికి వదలాలని తెలిపారు. పశువుకు వడదెబ్బ తగిలినప్పుడు శరీరంపై తడి గోతాలు కప్పి, నీడ ప్రదేశాలకు తరలించి, వెంటనే పశు వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. శిబిరంలో పశువులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేట్ అయ్యవర్లు, ఏహెచ్‌ఏ ఫరీద్ పాల్గొన్నారు.

మిలటరీ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



చెరుకుపల్లి: అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని నగరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు. గుళ్ళపల్లి గ్రామంలో మంగళవారం ఎస్‌ఐ, సిబ్బందితో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. మిలటరీ మద్యం అమ్మకాలు చేస్తున్న వాకా అచ్చయ్య నుంచి 11 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. అతనిని కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. మిలటరీ మద్యం అమ్మకాలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.

అక్రమ మద్యం విక్రయిస్తున్న..

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో మంగళవారం ఉదయం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ ఎ.లీనా తెలిపారు. అద్దేపల్లికి చెందిన షఫీవుల్లా బేగ్ నుంచి 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరుపరచినట్లు విలేకరులకు వెల్లడించారు. ఎస్ఐ వై.శ్రీనివాస్ ఆమె వెంట ఉన్నారు. అక్రమంగా మద్యం కలిగి ఉన్నా.. విక్రయించినా శిక్షార్హులని సీఐ హెచ్చరించారు.

పొందికైన రాత.. మార్కుల మోత

- చేతి రాతపై శ్రద్ధ చూపాలంటున్న నిపుణులు
- మెళకువలు పాటిస్తే 'పది'లో మెరుగైన ఫలితాలు



తరగతి గదిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు..

బాపట్ల అర్బన్: తలరాత బాగుంటే.. జీవితం బాగుంటుంది అనేది పెద్దల మాట. చేతిరాత బాగుంటేనే.. పరీక్షల్లో మంచి మార్కులొస్తాయనేది విద్యార్థులకు వర్తించే మాట. విద్యార్థుల్లో సబ్జెక్ట్‌పై ఎంత పట్టున్నా.. విషయ పరిజ్ఞానాన్ని పొందికైన అక్షరాలతో జవాబు పత్రంపై తీర్చిదిద్దకపోతే.. మార్కుల వేటలో వెనబడ్డట్టే. ఒక్క మార్కు తగ్గినా.. 90శాతం విద్యార్థి.. 80శాతానికి పడిపోయినట్లే. చేతిరాతే.. తలరాతను నిర్ణయిస్తుందని పదో తరగతి విద్యార్థులు గుర్తుంచుకోవాల్సిన ముఖ్యమైన అంశం. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు అదనపు మార్కుల సాధనకు చేతి రాతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నిపుణులు చెబుతున్నారు.

బాపట్ల జిల్లా పరిధిలో 17,356 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష సిద్ధమవుతున్నారు. సమాధాన పత్రం మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులు మనసును హత్తుకునేలా దస్తూరి ఉంటే మంచి మార్కులు సాధించవచ్చని సూచిస్తున్నారు. నేర్చుకోవాలనే ధ్యాస.. నిరంతర సాధన ద్వారా కేవలం 21 రోజుల్లోనే చేతి రాతలో గణనీయమైన మార్పులు సాధించవచ్చని అంటున్నారు.

విద్యావేత్తల సూచనలివి..

విద్యార్థులు సున్నా, ఆర సున్న నిలువ గీతాలపై బాగా సాధన చేయాలి. ఆంగ్ల, తెలుగు భాషల్లో మెరుగైన రాత కోసం అపసవ్య దిశలో రాయడం నేర్చుకోవాలి. జవాబులు రాసే సమయంలో ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకు కూర్చొని రాయడం మంచిది. అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగిన ఖాళీ ఉండేలా చూసుకోవాలి. పరీక్షల సమయంలో సమాధాన పత్రంలో జవాబు సూటిగా అక్షరాలు పొందికగా ఉంటే పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయులు అదనపు మార్కులు వేసే అవకాశం ఉంటుంది. ఒక పేజీకి 16 నుంచి 20 పంక్తులు పెంచకుండా ఉండాలి. అందుకే ప్రతి రోజూ కొద్దిసేపు రాతపై సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయొచ్చు.

చేతి రాతపై మక్కువ ఏర్పరుచుకోవాలి

చేతి రాతపై విద్యార్థులు మక్కువ ఏర్పరుచుకొని సాధన చేయాలి. చేతిరాత అందంగా ఉంటే మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులకు బాగా అర్థమై మంచి మార్కులకు ఆస్కారమేర్పడుతుంది.

– ఎండీ సాదిక్, సైన్స్ అధికారి, బాపట్ల జిల్లా

అక్షరమాల ఓ ఆయుధం



మంచి ఫలితాల సాధనకు చక్కటి అక్షరమాల ఓ ఆయుధం లాంటిది. సమాధాన పత్రం దిద్దే అధ్యాపకుడికి అక్షరాలు అందంగా కనిపిస్తే మార్కులు పెరిగే అవకాశం ఉంటుంది. పాఠ్యాంశాల పునశ్చరణతో పాటు గుండ్రని చేతిరాతపై పట్టు సాధించాలి.

– పీవీజే రామారావు, విద్యాశాఖాధికారి, బాపట్ల జిల్లా.

ఘనంగా హరిద్ర శృంగార్చన



ప్రత్యేక అలంకరణలో బండ్లమ్మవారు

పిట్టలవానిపాలెం : చందోలు గ్రామంలో వేంచేసిన శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి మాట్లాడారు. బగళాముఖి అమ్మవారి దేవాలయంలో ప్రతి మంగళవారం వివాహం కాని ఆడ పిల్లలకు శ్రీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపుకొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



సామూహిక హారతులిస్తున్న మహిళలు

కొనసాగుతున్న శ్రీమద్రామాయణ సప్తాహ ప్రవచనం

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలోని శ్రీ సీతారామ స్వామి మందిరంలో శ్రీమద్రామాయణ సప్తాహ ప్రవచన కార్యక్రమం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో దిగ్విజయంగా జరుగుతోంది. ఈ సందర్భంగా వక్తల ప్రవచనాలు ఆలోచింపజేస్తున్నాయి. మంగళవారం రాత్రి స్వామి వార్లకు మహిళలు సామూహిక హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, డి.సత్యన్నారాయణ, రామచంద్రరరావు, ఎం.రంగారావు, కేబీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే చైల్డ్‌లైన్ సేవలపై అవగాహన

తెనాలిరూరల్: గుంటూరు రైల్వే చైల్డ్ లైన్, తెనాలి ఆర్‌పీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చైల్డ్‌లైన్ సేవలు, స్టాప్ పెల్టింగ్ ఎట్ ట్రెయిన్స్ అన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్ ఆధ్వర్యంలో స్థానిక మోరిస్‌పేటలోని ఎన్‌సీఆర్‌ఎన్‌ఎం హైస్కూలులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ లక్ష్మి మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్తు పదార్థాలు, మద్యపానం, ధూమపానం వల్ల జరిగే నష్టాలను వివరించారు. తెనాలి ఆర్‌పీఎఫ్ ఏఎస్‌ఐ శివరామకృష్ణయ్య మాట్లాడుతూ పిల్లలు రైల్వేట్రాక్ దాటే సందర్భంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చలనంలో ఉన్న రైళ్లపై రాళ్లు విసరడం వల్ల తలెత్తే అనర్థాల గురించి చెప్పారు. చైల్డ్ లైన్ నోడల్ కో–ఆర్డినేటర్ సుగుణరాణి మాట్లాడుతూ చైల్డ్ లైన్ సేవలు, 1098 టోల్ ఫ్రీ నంబర్ ఆవశ్యకత, ఉపయోగాలను వివరించారు. రైల్వే చైల్డ్ లైన్ గుంటూరు కో–ఆర్డినేటర్ ఎ.కిషోర్ మాట్లాడుతూ పిల్లలు నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలు, బాలల హక్కులు, బాలికలపై లైంగిక దాడులు, బాలల అక్రమ రవాణా వంటి అంశాలపై వివరించారు. రైల్వే చైల్డ్ లైన్ కౌన్సిలర్ గ్లోరియా మాట్లాడుతూ పిల్లలు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒత్తిడికి గురికాకుండా ఉండే విధానాల గురించి వివరించారు. పాఠశాల హెచ్‌ఎం బషీర్‌అహ్మద్, నందన, చెల్సియా, ఆర్‌పీఎఫ్, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ శివరామకృష్ణయ్య

చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ

తెనాలిటౌన్: చిరు ధాన్యాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి సూచించారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, సీడీపీఓ డి.గీతాంజలి, సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, ఉప సర్పంచ్ మంచాల సురేష్, సూపర్‌వైజర్ హిమబిందు పాల్గొన్నారు. చిరు ధాన్యాలు తీసుకోవడం వల్ల బీపీ, షుగర్ రాకుండా నివారించుకోవచ్చని సీడీపీవో తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన వైఎస్సార్ కిట్‌లను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. తల్లులు, పిల్లలు చిరు ధాన్యాలను రోజువారి ఆహారంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎల్‌పీహెచ్ ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.



కఠెవరంలో ర్యాలీ నిర్వహించిన అంగన్‌వాడీలు

రైతులందరినీ భాగస్వాములను చేయాలి

తెనాలిరూరల్: భూముల రీ సర్వే, ఫీల్డ్ వెరిఫికేషన్ చేయనున్న నేపథ్యంలో రైతులను, ప్రజలను భాగస్వాములు చేయాలని తహసీల్దార్ కె.రవిబాబు సిబ్బందికి సూచించారు. మల్లెపాడు, సంగంజాగర్లమూడి, నందివెలుగు గ్రామాల భూముల రీ సర్వే ఓఆర్‌ఐ మ్యాపులు వచ్చిన నేపథ్యంలో ఆయా గ్రామాల్లో రీ సర్వే బుధవారం నుంచి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బందితో తహసీల్దార్ మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. శతాబ్దం క్రితం బ్రిటిష్ హయాంలో సర్వే జరిగిందని, ప్రస్తుతం రీ సర్వే వల్ల భూ వివాదాలు పరిష్కారమవుతాయని తెలిపారు. గ్రామాల్లో డ్రోన్ సర్వే ఇప్పటికే పూర్తయిందని, గ్రామ సభల అనంతరం సర్వే ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఏళ్ల తరబడి కలెక్టర్, సబ్ కలెక్టర్, తహీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాని వివాదాలు సర్వేతో సమసిపోతాయని, ప్రజలకు దీని గురించి అవగాహన కల్పించాలని సూచించారు.



సర్వేయర్, వీఆర్‌వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

తెనాలిరూరల్: ఆటో ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన ఘటన తెనాలిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన సొనాలీభాయి(80) మంగళవారం సాయంత్రం నడుచుకుంటూ వెళుతుండగా మార్కెట్ యార్డు ఎదుట వెనుక నుంచి వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. త్రీ టౌన్ పోలీసులు మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'ఆసరా' సంబరాలు

చుండూరు(వేమూరు): చుండూరు మండలంలోని వలివేరు గ్రామంలో వైఎస్సార్ ఆసరా కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గాదె శివరామ కృష్ణ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమన కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమానికి మంత్రి మేరుగ నాగార్జున పాల్గొంటారని పేర్కొన్నారు.

తీరిన మంచినీటి సమస్య



బాపట్ల అర్బన్ : ఎమ్మెల్యే కోన రఘుపతి చొరవతో తాగునీటి సమస్యను పరిష్కరించామని ఖాజీపాలెం సర్పంచ్ కుంతం అనూష ప్రసన్నరాజు తెలిపారు. పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామ్‌నగర్ ప్రాంతంలో జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన బోరును మంగళవారం ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. వైస్ ఎంపీపీ దెందుకూరు సీతారామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలు భాగ్యరాజు, దేవేంద్ర రాజు, కృష్ణమూర్తిరాజు, రామచంద్ర రాజు, ఏసు భక్తి, వార్డు సభ్యులు, పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిటౌన్: మాతృశ్రీ జిల్లెళ్ళమూడి అమ్మ శత జయంత్యుత్సవం సందర్భంగా బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం స్వరాజ్ టాకీస్ సెంటర్‌లో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అన్నాబత్తుని శివకుమార్, భీమరాజు భాగ్యలక్ష్మి ప్రారంభించారు. బ్రాహ్మణ పరిషత్ ప్రధాన కార్యదర్శి పి.పురుషోత్తమ శర్మ మాట్లాడుతూ మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల ద్వారా ఎంతో మందికి విద్యాదానం చేసిన మహోన్నత మూర్తి జిల్లెళ్ళమూడి అమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో తాడేపల్లి లోకనాథ్ శర్మ, పరాశరం వెంకట రామ్‌గోపాల్, వి.ఉమామహేశ్వరావు, టి.దత్తు, వి.మాధవ, సిహెచ్.శ్రీనివాస్, సీహెచ్.గోపాలకృష్ణ, శ్యామ్ సుందర్ శర్మ, ఆదిశేషగిరిరావు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ శర్మ, ఆనంద్ శర్మ, శ్రీనివాస్, తెలుగుపండితులు శారద వరప్రసాద్, వి.హనుమంతరావు పాల్గొన్నారు.

హోప్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో..

తెనాలిటౌన్: కఠెవరం గ్రామ సమీపంలో కాల్వ కట్టపై నివసిస్తున్న హోప్ మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాముల రూజ్‌వెల్ట్ ఆధ్వర్యంలో మంగళవారం 200 మంది పేదలకు పేదలకు అన్నదానం చేశారు. రూజ్‌వెల్ట్ మాట్లాడుతూ దివంగత పాముల ఐజయ్య చేసిన పరిచర్యను గుర్తు చేసుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అచ్చిరెడ్డి, సునీల్, లూతమ, స్వర్ణ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

'మత్తు'కు బానిసలైతే జీవితాలు దుర్భరం

రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ



నగరం: విద్యార్థులు ఆల్కహాల్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే జీవితం నాశనమవుతుందని రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో మంగళవారం జరిగిన యాంటీ డ్రగ్స్–సంకల్పం కార్యక్రమంలో డీఎస్పీ పాల్గొని, మాట్లాడారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల ఆరోగ్యం దెబ్బతిని, మానసిక రోగులుగా మారుతున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడంతో..రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నట్లు పేర్కొన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రేపల్లె రూరల్ సీఐ శివశంకర్ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ, ఎస్ఐలు రామకృష్ణ, కొండారెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాల అమలు

'గడప గడపకు' కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి నాగార్జున

పెరవలి(వేమూరు): పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. మండలంలోని పెరవలి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లిన మంత్రి.. సంక్షేమ పథకాల అమలు తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ నిర్వహణలో కూడా చంద్రబాబు నాయుడు అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు అనేక అవినీతి పనులకు పాల్పడ్డారని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రెయినేజీ సమస్యను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపీపీ యల్లమాటి మోహన్‌రావు, సర్పంచ్ దాది వెంకటలక్ష్మి రాజ్యం, దాది సుబ్బారావు, ఎంపీటీసీ దాది రజని, దాది కాకులేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గాజుల భానుప్రకాశ్, పట్టెల రంగబాబు, మాజీ సర్పంచ్ దాసరి పోతురాజు, విష్ణు మొలకల వెంకట రెడ్డియ్య, మాజీ జెడ్పీటీసీ విష్ణుమొలకల వెంకటేశ్వరావు, మాజీ ఎంపీటీసీ దాసరి మోహనరావు, ఏడుకొండలు, దాసరి వసంతరావు, దాసరి సుబ్రమణ్యం, తాత గంగయ్య, కొండ్రు శ్రీనివాస రావు, గుమ్మడి సత్యనారాయణ, గుమ్మడి చిన్న, దాసరి శ్రీనివాసరరావు, తోట కూర ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ఆసరా



నగదు చెక్కును మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ ఆసరా పథకం దోహదపడుతుందని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. కర్లపాలెంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత నగదు విడుదల సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. డ్వాక్రా మహిళలు సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే కోన రఘుపతి చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సభలో ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని రైతులను, మహిళలను మోసం చేశారని దుయ్యబట్టారు. సీఎం జగన్ ఎన్నికల హామీ మేరకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పొదుపు సంఘాల రుణ మాఫీ చేస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక సమస్యలున్నప్పటికీ మూడు దఫాలుగా నగదు విడుదల చేశారని గుర్తుచేశారు. కర్లపాలెం మండలంలో 1,079 పొదుపు గ్రూపులకు రూ.9.81కోట్ల నగదు చెక్కును ఎమ్మెల్యే కోన అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, కాగిత బుల్లియ్య, వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కో–ఆర్డినేటర్ లక్ష్మణాచారి, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సీహెచ్ ధనలక్ష్మి, రీజినల్ కో–ఆర్డినేటర్ బడుగు ఇందిరా, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు పిట్టు అశ్వినీరెడ్డి, సొసైటీ చైర్మన్ పెద వెంకటేశ్వర్లు, సర్పంచ్‌లు లలితకుమారి, అంకమ్మ, వెంకటేశ్వరమ్మ, కరుణకుమారి, శ్రీనివాసరెడ్డి, సురేష్‌రాదవ్, ఏడుకొండలు, ఎంపీటీసీలు సాంబ శివరావు, ఆసిఫ్ అలీ, వాణి, కమల, లక్ష్మణ రావు, సుబ్బారెడ్డి, అమీర్ బేగ్, పార్టీ నాయకులు సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, ఆట్ల నాగేశ్వరరెడ్డి, యల్లావుల ఏడుకొండలు, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, అమీర్‌బేగ్ తదితరులు ఉన్నారు.

బండ్లమ్మ ఆలయానికి రూ.18వేల అధిక ఆదాయం

పిట్టలవానిపాలెం: చందోలు బండ్లమ్మ దేవాలయంలోని కల్యాణ మండపంలో ఫ్లవర్ డెకరేషన్, అద్దె ప్రాతిపదికన సామగ్రి సరఫరాకు దేవాదాయధర్మదాయ శాఖ అధికారులు మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి వివరాలు వెల్లడించారు. బహిరంగ వేలంలో మొత్తం 24 మంది పాల్గొన్నారని తెలిపారు. అయితే ఏడుగురు ప్రథమ ధరావత్తు చెల్లించారని చెప్పారు. ఫ్లవర్, ఎలక్ట్రికల్ డెకరేషన్‌ను కొండవీటి జగదీష్ రూ.76 వేలకి, సామగ్రి సరఫరా లైసెన్సు కొండవీటి శ్రీనివాస్ రూ.35 వేలకు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ ఏడాది దేవస్థానానికి రూ.18 వేలు అధికంగా ఆదాయం లభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు తుమ్మ జోగేశ్వర రెడ్డి, పెనుగొండ బాలకృష్ణమూర్తి, కుంచల నరసా రెడ్డి, చందోలు సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి, మునీర్, ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ హుస్సేన్, బాపట్ల ఏఎంసీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

ఆదర్శ ఉపాధ్యాయ పండితుడు 'పుట్టపర్తి'

బాపట్ల: ఆధునిక మహా కావ్యంగా చరిత్ర సృష్టించిన 'శివ తాండవం' సృష్టికర్త పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు ఉపాధ్యాయుడిగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని బాపట్ల వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నారాయణాచార్యులు జయంతి సందర్భంగా కళాశాలలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నారాయణాచార్యులు పన్నెండేళ్ల వయస్సులోనే పెనుగొండ లక్ష్మీ అనే గేయ కావ్యం రచించి, బాల కవిగా పేరొందారన్నారు. భాగవతాన్ని ఆంగ్ల భాషలోకి అనువదించి.. ఆంగ్ల కవులను విస్మయపరిచారని తెలిపారు. ఆయన అందరికీ ఆదర్శనీయులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొటేశ్వరరావు, డాక్టరు ఎం.రమాదేవి, సంధ్యారాణి, చంద్రశేఖర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న డీన్ డాక్టరు శ్రీనివాసరావు, అధ్యాపకులు

ఆలయ సమీపంలో గుంతలు పూడ్చాలి

తెనాలిఅర్బన్: మార్కెట్ సమీపంలోని భక్త ఆంజనేయస్వామి దేవస్థానానికి ఇరువైపులా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయని తెనాలి పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఆలయ ప్రాంతాన్ని పరిశీలించారు. నాలుగు లైన్ల రోడ్డు నిర్మించే సమయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు దేవస్థాన గోడకు కలుపుతూ ప్రహరీ నిర్మించాల్సి ఉండగా అలా చేయలేదని చెప్పారు. దీని వలన గుంతలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. వెంటనే గోతులను పూడ్చి ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు, సభ్యులు బొమ్మదేవర వెంకటేశ్వరరావు, నారాయణం కమల్‌కుమార్, రావూరి శివశంకరరావు, అబ్దుల్ ఆరిఫ్, అబ్రహం లింకన్, వాకా పేరిరెడ్డి, సిహెచ్.మురళి జగన్‌మోహన్‌రావు, శివరామయ్య, తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న అభివృద్ధి సంఘం సభ్యులు